క్లుప్తంగా

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన జనసేన నాయకుడు రామ్‌సుధీర్



పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జోగి రమేష్‌ను పెడన నియోజకవర్గ బాధ్యతలను నిర్వహించిన జనసేన పార్టీ నాయకుడు యడ్లపల్లి రామ్‌సుధీర్ కలిశారు. మంగళవారం విజయవాడలో మంత్రితో రామ్‌సుధీర్ సుమారు గంటకు పైగా వివిధ అంశాలపై చర్చించారు. తన అనుచరులు, పెడన నియోజవర్గంలో ఇప్పటివరకు తన వెంట నడిచిన వారితో సంప్రదించి తన భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని రామ్‌సుధీర్ తెలిపారు. ఇటీవల పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను తనను కాదని వేరే వారికి అప్పగించడంపై గుర్రుగా ఉన్న రామ్‌సుధీర్ జోగి రమేష్‌ను కలవడం పెడన నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. త్వరలో ఆయన వైఎస్సార్ సీపీలోకి వస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

హనుమాన్ చాలీసా పారాయణం

రేమాలవారిపాలెం(నాగాయలంక): స్థానిక సువర్చలా సమేత భక్తాంజనేయస్వామి, సీతారామచంద్రుల ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం, సామూహిక హనుమాన్ పూజ జరిగాయి. ఈ విశేష కార్యక్రమాన్ని ఆలయంలో 2004లో ప్రారంభించగా 19 ఏళ్లుగా ప్రతి మంగళవారం చాలీసా పారాయణం, పూజ కొనసాగుతోందని జై హనుమాన్ భక్త సేవా సమాజం అధ్యక్షుడు రేమాల రామగోపాల్ తెలిపారు. 11 పర్యాయాలు జరిగిన చాలీసా పారాయణం, సామూహిక పూజలో 158 మంది మహిళలు పీటలపై కూర్చున్నారు. అతిథులుగా హాజరైన అవనిగడ్డ ఎమ్మెల్యే తనయుడు సింహాద్రి వికాస్, శ్యామ్‌కిశోర్‌లను ధర్మకర్త బెనర్జీ దుశ్శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మందికి కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు.

వంట పాత్రల పంపిణీ

పెడన: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి జగనన్న గోరుముద్దను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం వంట సామగ్రిని అందజేస్తోందని కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎన్‌కేఎస్ ప్రకాశరావు అన్నారు. మంగళవారం జెడ్పీహెచ్‌ఎస్ చేవేంద్రకు వంట పాత్రల సామగ్రిని వంట ఏజెన్సీ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకెం గిరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాభినయం

నాగాయలంక: కృష్ణా నది తీరంలో నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రంలో సోమవారం రాత్రి గ్రామంలోని ఇద్దరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక ఈశ్వర్ డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు పారుపూడి ప్రిహాస్, పారుపూడి సృజిసాయి నమశ్శివాయ.. నమశ్శివాయ అంటూ సెమీ క్లాసికల్ నృత్యాన్ని ప్రదర్శించారు. చక్కని హావభావాలు ప్రదర్శించి కరతాళ ధ్వనులందుకున్నారు.

కార్తిక వైభవం



నాగాయలంక/మచిలీపట్నం టౌన్: కృష్ణానది దక్షిణ పాయ బంగాళాఖాతంలో సాగర సంగమ ప్రాంతంగా విశిష్టత కలిగిన శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్య కార్తిక వైభవం విరాజిల్లుతుంది. అంబాసాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో కనువిందుగా ప్రదర్శించిన హారతులను భక్తిశ్రద్ధలతో తిలకించారు. బందరులోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో పేర్ని కిట్టు పూజలు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గూడూరు: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. నాబార్డు సౌజన్యంతో మండలంలోని జక్కంచర్ల, ముక్కొల్లు, కంకటావ, గూడూరు, మల్లవోలు, రాయవరం గ్రామాల్లో నిర్వహించిన ప్రదర్శనల్లో డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన భక్తులు తాడికొండ పవన్‌కుమార్, గీత దంపతులు రూ. 25 వేలు విరాళంగా అందజేశారు. మంగళవారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు విరాళాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులను సత్కరించారు.

వరి కోతలు ప్రారంభం

కోడూరు: మండలంలోని ఎగువ ప్రాంతాల్లో రైతులు వరి కోతలను ప్రారంభించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపారు. వరికోత యంత్రాల సహాయంతో మంగళవారం రైతులు వరికోతకు శ్రీకారం చుట్టారు. యంత్రాలతో పంటను కోసి ధాన్యాన్ని ఇళ్లకు తరలించారు.

జగన్‌తోనే సుపరిపాలన

- ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'
- సంక్షేమ బోర్డులు, పార్టీ పతాకాల ఆవిష్కరణ

పెడన: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సుపరిపాలన అందుతుందని, నిరుపేదలందరికి సంక్షేమ ఫలాలు అందుతాయని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుతరావు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కమలాపురం గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎందరు, వారందరికి ఎంత నగదు అందజేసింది, గ్రామ పరిధిలో అభివృద్ధికి కేటాయించిన నిధులు, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డును స్థానిక నాయకులతో కలిసి అచ్యుతరావు ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మనకు మళ్లీ సీఎంగా ఉండాలని, అందుకు అందరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు ప్రభుత్వానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను, అమలు జరిగిన సంక్షేమ పథకాలను వివరించారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జనన్నే మళ్లీ సీఎం కావాలని, అందుకు మీరంగా అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, సర్పంచ్ గుడిశేవ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ జయరాం, నాయకులు, స్థానిక పెద్దలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గణపేశ్వరంలో..

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరం సచివాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, రైతు నాయకుడు బీమా బాబూరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ పరిధిలో సంక్షేమం, అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఖర్చు చేసిన నిధుల వివరాలను ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ వివరించారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. సర్పంచి నాయుడు ఉమాదేవి, ఎంపీటీసీ విశ్వనాథపల్లి నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఎంవీ సాంబశివరావు (నాగాయలంక), తోట సాయిబాబు (బర్రంకుల), పూర్వ డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, ఎంపీటీసీ మోకా నాగప్రసాద్, మాజీ సర్పంచ్ దాసి జీవరత్నం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.



కమలాపురంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన అచ్యుతరావు తదితరులు



గణపేశ్వరంలో మాట్లాడిన రైతు నాయకుడు బాబూరావు



వెంకటాపురంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేసిన నాయకులు

- కృత్తివెన్ను: మండల పరిధి నిడమర్రు-1 సచివాలయం పోడు గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ భూపతిరాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె. బాపూజీ, ఎంపీటీసీ పెద్దింట్లమ్మ, లీగల్ సెల్ కన్వీనర్ ప్రసాద్, ఎస్సీ సెల్ కన్వీనర్ జాన్‌రత్నం, సచివాలయ కన్వీనర్ ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.
- గూడూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం గూడూరు మండలం ముక్కొల్లు సచివాలయంలో నిర్వహించారు. సంక్షేమ బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, ముక్కొల్లు, గండ్రం సర్పంచులు సమ్మెట జయరామ్, గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంపీటీసీ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- కోడూరు: కోడూరు-2 సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో 7,940 మంది లబ్ధిదారులు ప్రత్యక్షంగా రూ.25.36కోట్లు, 2,147మంది లబ్ధిదారులు పరోక్షంగా రూ.8.72 కోట్ల నిధులు వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందారని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. రాత్రికి పల్లె నిద్ర చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ వరికె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- కొత్తమాజేరు(చల్లపల్లి): కొత్తమాజేరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, గ్రామంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు, మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసిన తీరు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని), నాయకులు పాల్గొన్నారు.

పేదవర్గాలకు జగనన్న అండ..

వెంకటాపురం(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసి అండగా నిలిచారని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు, జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన హామీల అమలును బుక్‌లెట్ ద్వారా ప్రజలకు వివరించి వారి సంతృప్తి మేరకు స్టాంప్ వేయించి తీసుకున్నారు. పేద పిల్లల భవిష్యత్, ప్రజల ఆరోగ్యంపై జగనన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, అన్నివర్గాలకు మేలు జరుగుతోందని, మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. సర్పంచ్ తుమ్మా సోములమ్మ, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగ మల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఆది రాంబాబు, రావి రాంప్రసాద్, రెడ్రౌతు వెంకట రమణ, తుటారం కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, లింగం జగదీష్‌కుమార్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, రెడ్రౌతు రాంప్రసాద్, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, గ్రామ కన్వీనర్ పిండి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): వ్యవసాయ క్షేత్రాల వద్ద సేకరించిన ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లులకు రవాణా చేసేందుకు జీపీఎస్ ఉన్న వాహనాలను వినియోగించాలని, ప్రభుత్వం నిర్దేశించినట్లు ఈ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం ధాన్యం సేకరణ ప్రక్రియపై క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉయ్యూరు డివిజన్‌లో ధాన్యం సేకరణ ప్రారంభమైందని, 45 వాహనాలను ఉయ్యూరు, కంకిపాడు, పామర్రు ప్రాంతాలకు పంపించే ప్రక్రియ మొదలైందన్నారు. ధాన్యం సేకరణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు యాప్‌ను అందరూ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరుగుతోందన్నారు. రైతులు పండించిన ధాన్యం అమ్మకాల్లో ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా సహకార సంఘాలు, రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి కొరత లేదన్నారు. 3 వేల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం సేకరించే కేంద్రాల వద్ద ధాన్యం శాంపిల్ టెస్టింగ్ చేసే టెక్నికల్ అసిస్టెంట్‌కు అదనంగా మరో సహాయకులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.

క్రీడాకారుడికి అభినందన

కోనేరుసెంటర్: మచిలీపట్నానికి చెందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రభువును డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ మంగళవారం అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభువు డిసెంబర్ 8,9,10 తేదీల్లో అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే పోటీలకు హాజరుకానున్నాడు. ప్రభువు పోతేపల్లి సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 గా పనిచేస్తున్నాడు. ప్రభువును సూర్యనారాయణ అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

పూలే ఆశయ సాధనకు కృషి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతీరావు పూలే ఎంతగానో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మంత్రివర్గంలో, రాజ్యసభ సీట్లు, పరిపాలనలో బీసీలకు సీఎం పెద్ద పీట వేశారని తెలిపారు. ఓసీ జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెట్టి మున్సిపల్, కార్పొరేషన్ల చైర్మన్లను చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బీసీల సాధికారతకు సీఎం పనిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, మాజీ సర్పంచ్‌లు నలుకుర్తి పృథ్వీరాజ్, సైకం బాబూరావు, బీసీ నాయకులు అవనిగడ్డ వెంకటేశ్వరరావు, సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలపూడి బాలు, గుగ్గులోతు ప్రసాద్ పాల్గొన్నారు.

బహుజనుల ఆరాధ్య దైవం పూలే

నాగాయలంక: ఒకప్పుడు కొందరికే పరిమితమైన విద్యను అందరికీ అందించాలని పోరాడిన మహాత్మా జ్యోతీరావు పూలే బహుజనుల ఆరాధ్య దైవమని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహిళా వృద్ధాశ్రమంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి తహసీల్దార్ విమలకుమారి, రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. వాటర్ స్పోర్ట్స్ నేషనల్స్‌లో పతకాలు సాధించిన నాయుడు గాయత్రి, భార్గవిలను రెడ్‌క్రాస్ తరఫున సన్మానించారు. ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా రెడ్ క్రాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సింహాద్రి కృష్ణప్రసాద్, స్థానిక రెడ్‌క్రాస్ ప్రతినిధులు లేబాక నాగేశ్వరరావు, చిట్టా శేఖర్, ఆశ్రమ ప్రతినిధి తలశిల రఘుశేఖర్ పాల్గొన్నారు.



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పూలేకు ఘన నివాళి

పెడన: సంఘ సంస్కర్త, సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతీరావు పూలే అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు అన్నారు. పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మ జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ సమన్యాయ సత్యశోధకుడిగాను, మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. జయలక్ష్మి పీఏసీఎస్ అధ్యక్షుడు వరుదు రామకృష్ణ, కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు, నాయకులు వన్నెంరెడ్డి మహంకాళరావు, వీరంకి శ్రీనివాసరావు, కోడూరు శ్రీను, బొర్రా మహేష్, వీణం రాము, ఖలీల్ పాల్గొన్నారు.

- చల్లపల్లి: మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. మంగళవారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రధాన కూడలిలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానా, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, నూకల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు ఫణి, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.
- మచిలీపట్నంటౌన్: సంఘ సంస్కర్త జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు. స్థానిక వలందపాలెంలోని బీసీ సంక్షేమ వసతిగృహం ఆవరణలోని పూలే విగ్రహానికి సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షేక్ షాహిద్‌బాబు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోటేశ్వరరావు, గోవింద్, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.
- బంటుమిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి. వెంకటేశ్వరరావు, ఏఓ డీవీఆర్‌కేశర్మ, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లి తదితరులు

ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: చేనేత కార్మికులు ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 29వ డివిజన్ చింతగుంటపాలెం దేవాంగ కల్యాణ మండపంలో మంగళవారం ఆ ప్రాంతానికి చెందిన 85 మంది చేనేత కార్మికులకు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ. 60 లక్షల ముద్ర రుణాల చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ చేనేత కార్మికులు ఈ రుణాలతో మెటీరియల్ కొనుగోలు చేసుకుని తద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు సక్రమంగా చెల్లిస్తే రానున్న రోజుల్లో మరింత రుణం అందిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ ఈ ప్రాంత చేనేత కార్మికులు ఇప్పటికే పలుమార్లు ముద్ర రుణాలు తీసుకుని సక్రమంగా కట్టడంతో కార్మికులకు బ్యాంకు ముందుకు వచ్చి రుణాలు అందిస్తోందన్నారు. ముద్ర రుణం సబ్సిడీని మినహాయించి మిగిలిన మొత్తాల వాయిదాలను సక్రమంగా చెల్లించాలన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, 39వ డివిజన్ కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాస కుమార్, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్ నోబుల్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ పి. ప్రకాష్, చెమ్మనగిరిపేట బ్రాంచ్ మేనేజర్ కె. విష్ణు, అసిస్టెంట్ మేనేజర్ లోకేష్, శ్యామ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, కిట్టు

గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఈ నెల 30న మచిలీపట్నం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్‌లో ఎస్పీ పి. జాషువాతో కలిసి ఆయన మంగళవారం సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా సుల్తానగరంలోని సుమ కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారన్నారు. గవర్నర్ ప్రయాణించే మార్గంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రదర్శనశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడేందుకు సిద్ధం చేయాలని చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ జాషువా మాట్లాడుతూ సుమ కన్వెన్షన్ హాల్‌లో పోలీస్ బందోబస్తు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం కన్వెన్షన్ హాల్‌ను కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. జెడ్పీ సీఈవో వి జ్యోతిబసు, డీపీఓ నాగేశ్వరనాయక్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్డీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో ఎస్పీ జాషువా తదితరులు

ఉపాధి హామీ పనులపై సామాజిక ప్రజా వేదిక

నాగాయలంక: ఉపాధి హామీ పనులపై సామాజిక ప్రజా వేదిక కార్యక్రమం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఉయ్యూరు క్లస్టర్ ఏపీడీ ఏవీఎన్ నాంచారయ్య మాట్లాడుతూ మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,042 పనులను రూ.11.77 కోట్లతో చేపట్టిన 4,06,652 పనిదినాలకు సంబంధించి ఆడిట్ టీమ్‌లు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీలు పూర్తి చేశారన్నారు. వేతన చెల్లింపులకు చెందిన రసీదులు నివేదించకపోవడం ఏమిటని క్షేత్ర సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పలుచోట్ల మస్టర్ తప్పిదాలను గుర్తించారని, వీటిని సరిచేసుకోవాలని, ఏడు రిజిస్టర్ల అప్‌డేట్ సమర్థవంతంగా నిర్వహించాలని, కొలతల నమోదులో టెక్నికల్ అసిస్టెంట్లు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. మచిలీపట్నం క్లస్టర్ ఏపీడీ ఎంవీ రమణ, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ వెన్నా శ్రీలత, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ చిన్నబ్బాయి, అసిస్టెంట్ డీవీఓ సురేష్, ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్, ఏపీఓ రవికుమార్, తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



క్షేత్ర సిబ్బంది నుంచి సమాచారం తెలుసుకుంటున్న ఏపీడీ నాంచారయ్య

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, శిశుగృహాల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఖాళీ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్. సువర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్-1, ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇన్‌స్టిట్యూషన్ కేర్)-1, ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్)-1, లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్-1, కౌన్సిలర్-1, ఎకౌంటెంట్-1, సోషల్ వర్కర్ (ఓసీ-1, ఎస్సీ-1)-2, అవుట్ రీచ్ వర్కర్-1 పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శిశు గృహాలో సోషల్ వర్కర్-1, పార్ట్‌టైమ్ డాక్టర్-1, ఆయాలు (ఓసీ-1, ఎస్సీ-1) -2, చౌకీదార్ -1 పోస్టు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దరఖాస్తులను డిసెంబర్ 7వ తేదీలోగా కానూరులోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 99493 31320, 79015 97290 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

అవనిగడ్డ: మండల పరిధి రామకోటిపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పొదుపుపై కళాజాతా ప్రదర్శనలు

పెడన: ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతా తెరవాలని సహకార కేంద్ర బ్యాంకు పెడన బ్రాంచ్ మేనేజర్ సాయిబాబు అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా ప్రదర్శన పెడనలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాయిబాబు ప్రారంభించారు. కళాజాతా ప్రదర్శనలు పెడన మండలంలోని చేవేంద్ర, కమలాపురం గ్రామాలతో పాటు బందరు మండలం బుద్దాలపాలెంలో జరిగాయి. గ్రామీణ, పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణాలు, పొదుపు ఖాతా వలన కలిగే ప్రయోజనాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం, రూపే, డెబిట్ కార్డ్ వాడకం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలను కళాకారులు వివరించారు.

కార్తిక వనసమారాధన

కృత్తివెన్ను: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం కృత్తివెన్ను మండలం గాంధీనగరం గ్రామంలో అభయాంజనేయస్వామి వారి దేవస్థానం వద్ద కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వన సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. పోతేపల్లిలోని బాలుర వసతిగృహంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. సంకల్పం అనేది చాలా ముఖ్యమని, ఆ సంకల్పం దృఢంగా ఉంటే విద్యకు ఏదీ అడ్డురాదని, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. పలు చట్టాలను వివరించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.